ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమీర్‌పేట: బల్కం పేట ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం లక్ష్య పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. కార్తీక మాసంలో ప్రతీ ఆదివారం లక్ష్య పుష్పార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా బాలోత్సవం

నాంపల్లి: నృత్య భారతి ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నందమూరి తారక రామారావు కళా మందిరంలో బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల నృత్య ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథులుగా తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సినీ నటులు ధ్రువ వాయు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నృత్య భారతి పురస్కారాలు అందుకున్న నృత్య గురువులను నిర్మలా జగ్గారెడ్డి అభినందించారు. కళింగ ఫేమ్ డైరెక్టర్, కథా నాయకుడు ధ్రువ వాయు మాట్లాడుతూ..చిన్నారుల నృత్య ప్రదర్శనలను చూసే అవకాశం కలిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నారాయణ జూనియర్ కళాశాల వ్యవస్థాపకుడు బొల్లంపల్లి మధుకర్ మాట్లాడుతూ.. కళలతోనే బాలలకు సంపూర్ణమైన వికాసం, జ్ఞానం లభిస్తుందన్నారు. అనంతరం నృత్య ప్రదర్శనలు చేసిన బాలలకు జ్ఞాపికలు, పురస్కారాలను అందజేశారు. నృత్య గురువులకు నృత్య భారతి బిరుదులను ప్రదానం చేశారు.

స్టిక్కరింగ్‌కే దిక్కులేదు.. సర్వే మాట

దేవుడెరుగు..!



ముషీరాబాద్‌లో నత్తనడకన సర్వే ● స్టిక్కర్ల కొరత.. ఇంకా రాని సర్వే పుస్తకాలు

ముషీరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుల గణన ముషీరాబాద్ నియోజకవర్గంలో నత్తనడకన సాగుతోంది. అధికారుల, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో 6, 7, 8వ తేదీల్లో మూడు రోజుల్లో పూర్తి చేయాల్సిన స్టిక్కరింగ్ 10వ తేదీ అంటే ఐదో రోజు కూడా పూర్తి కాకపోవడం చూస్తుంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే అర్థం అవుతోంది.

◆ అడిక్‌మెట్ డివిజన్‌లోని మేడిబావి బస్తీలో సుమారు 250 గడపలు ఉండగా ఒక్క ఇంటికి కూడా ఆదివారం సాయంత్రం వరకు స్టిక్కరింగ్ వేయలేదు అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నియోజకవర్గంలో ఇలాంటి బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు అనేకం ఉన్నాయి. పలు ప్రాంతాల్లో ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చి స్టిక్కర్ వేసి వారి పేరును నమోదు చేసుకున్న దాఖలాలు కనిపించడం లేదని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు.

ఒక్కో ఎన్యుమరేటర్‌కు రూ.10వేల పారితోషికం..

◆ ముషీరాబాద్ నియోజకవర్గంలో 588 మంది ఎన్యుమరేటర్లను నియమించి వారికి ఒక్కొక్కరికి రూ.10వేల పారితోషికం నిర్ణయించారు. అయినప్పటికీ పలువురు ఆశావర్కర్లు విధులకు గైర్హాజరు అవుతున్నారు. ఇక దీనికి తోడు ఒక డివిజన్‌కు చెందిన ఆశావర్కర్లను మరో డివిజన్‌కు జంబ్లింగ్ పద్ధతిలో విధులు కేటాయించారు. దీంతో ఆశావర్కర్లకు ఆ ప్రాంతంపై పట్టులేకపోవడంతో వారికి కేటాయించిన 150–175 ఇళ్ల సర్వేకు స్టిక్కరింగ్ నేటికి వేయలేకపోతున్నారు. దీనికి తోడు స్టిక్కర్ల కొరత కూడా ఉండటంతో స్టిక్కర్ అంటించకుండానే ఇంటింటికి తిరిగి రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకుంటున్నారు.

- ఎన్యుమరేటర్లకు ఐడీ కార్డుల దిక్కేలేదు
- జీహెచ్‌ఎంసీ అధికారుల, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం



భోలక్‌పూర్, ముషీరాబాద్‌లో భాష సమస్య..

ముషీరాబాద్ నియోజకవర్గంలో భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్‌లలో అత్యధికంగా మైనార్టీలు ఉండటంతో ఆ ప్రాంతంలో తెలుగు వచ్చే వారిని విధులు కేటాయించడంతో భాష సమస్య ఎదురవుతోంది. దీంతో వీరు అడిగే ప్రశ్నలకు వారు చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉంటున్నాయి. ఇక ఎన్యుమరేటర్లకు ఐడీకార్డులు కూడా కొంత మంది ఇవ్వకపోవడంతో వారు ఇంటింటికి వెళ్లి సర్వే చేసే క్రమంలో ఇంటి యజమానుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మీ కార్డులు చూపించాలని కొందరు ప్రశ్నించడంతో ఎన్యుమరేటర్లు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

◆ 8వ తేదీ వరకు స్టిక్కరింగ్ పూర్తి చేసి 9వ తేదీన సర్వే మొదలుపెట్టాలి. కానీ మెజార్టీ డివిజన్లకు సర్వే బుక్కులు కూడా రాలేదు. దీంతో సర్వే మొదలు కాలేదు.

◆ మొత్తం 56 ప్రశ్నలు ఉండడంతో ముఖ్యంగా ఆస్తులు, భూములు, ఇతరాత్ర ప్రశ్నలు అడిగినప్పుడు మీకెందుకు చెప్పాలంటూ ఎన్యుమరేటర్లను ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఈ సమాచారం తీసుకొని ఏమి చేస్తారంటూ అడగడంతో సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు.

◆ జీహెచ్‌ఎంసీ అధికారులు, డివిజన్ల సూపర్‌వైజర్లు కేవలం ఎన్యుమరేటర్ల మీదనే బాధ్యత పెట్టి పర్యవేక్షణ చేయడం లేదు. దీంతో ఫీల్డ్ మీద వారికి ఎదురైయ్యే సమస్యలను సూపర్‌వైజర్లకు చెబుదామంటే వారు ఫీల్డ్‌కు రాకపోగా కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని ఎన్యుమరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇలా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ సర్వే ఆదిలోనే అనేక సమస్యలను ఎదుర్కొంటూ నత్తనడకన ముందుకు సాగుతోంది.

స్పందించని డీఎంసీ..

ముషీరాబాద్ నియోజకవర్గంలో సర్వే ఎలా కొనసాగుతోంది. మొదటి రోజు ఎన్ని ఇళ్లను సర్వే చేశారు అనే విషయాలను తెలుసుకునేందుకు పలుమార్లు డీఎంసీకి ఫోన్ చేసినా స్పందన లేదు. సూపర్‌వైజర్లు, డీఎంసీ కూడా స్పందించడం లేదని ఎన్యుమరేటర్లు చేసిన ఆరోపణకు బలం చేకూరినట్లు అయ్యింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు.

◆ వైఎంసీఏ ఫీడర్ పరిధిలో విఠల్‌వాడీ, నారాయణగూడ బ్లడ్ బ్యాంక్, లింగంపల్లి వాటర్‌వర్క్స్, రాఘవేంద్రస్వామి టెంపుల్, నృపతుంగా కాలేజ్ తదితర ప్రాంతాలలో 10గంటల నుంచి 2గంటల వరకు...

◆ బసంత్ కాలనీ ఫీడర్ పరిధిలో లింగంపల్లి, వైశ్యహాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాలలో 11గంటల నుంచి ఒంటిగంట వరకు..

◆ ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతీ మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ ఆమోదిత ఏఐ డేటాసైన్స్, బిగ్ డేటా కోర్సులతో పాటు 100కు పైగా కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, ఏఐ డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఎథికల్ హ్యాకింగ్, మెషిన్ లెర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్ తదితర కోర్సులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 95058 00050/47..

దిశా సభ్యుడిగా నర్సింహ నియామకం



ముషీరాబాద్: హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పరివేక్షణ కమిటీ(దిశా) సభ్యుడిగా భోలక్‌పూర్‌కు చెందిన నందిగిరి నర్సింహ నియమితులయ్యారు. ఆయనకు కమిటీ చైర్మన్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నందిగిరి నరసింహ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కమిటీలో కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు ఉన్నారని వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రతి పౌరుడికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్తానన్నారు. అర్హులైన ప్రజలకు పథకాలు అందేలా అంకిత భావంతో పనిచేస్తామని అన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: బీజేపీ జాతీయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా డాక్టర్ కె.లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌కు చెందిన బీజేజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విధానాలకు ప్రజలు విసుగు చెందారన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా బీజేపీకి మద్దతు పలుకుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, నాయకులు నర్సింగ్‌రావు, ఉమేష్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జి కనకేష్‌కుమార్

బండి సంజయ్ వ్యాఖ్యలు అవగాహన రాహిత్యం

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై విద్యార్థి నాయకులు ఆదివారం మండిపడ్డారు. తెలంగాణ విద్యా కమిషన్‌లో నక్సలైట్ భావజాలం గల వ్యక్తులు ఉన్నారని అనుచిత వ్యాఖ్యలు చేయడం అవగాహన రాహిత్యమని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ పేర్కొన్నారు. విద్యా కమిషన్‌పై అర్థరహిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ కేంద్రమంత్రి పదవి అనర్హుడని ఓయూ విద్యార్థి నేత వలిగొండ నరసింహ ధ్వజమెత్తారు. విద్యా కమిషన్‌కు చైర్మన్‌గా, ఇతర అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి ఐఏఎస్ అధికారి, వర్సిటీల ప్రొఫెసర్లు, పీహెచ్‌డీ డాక్టరేట్లు చేసిన వ్యక్తులను నియమిస్తే వారు నక్సలైట్ భావజాలం అని బండి సంజయ్ పేర్కొనడం సిగ్గుచేటు అన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నూతన కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నూతన కమిటీని ఆదివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా మనోజ్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ఈశ్వర్, ముత్తయ్, జాయింట్ సెక్రెటరీలుగా రాకేష్, సాయిభర్గవ్‌రెడ్డి, రోహిత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి నియమించిన్నట్లు ఓయూ అధ్యక్షుడు రవినాయక్ తెలిపారు.

వర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ 121 తరగతి గదిలో ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కౌన్సిల్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఉన్నత విద్య మండలి అధికారులకు, వైస్ ఛాన్సలర్లకు 8 ప్రతిపాదనలు చేశారు. వర్సిటీల ఖాళీల భర్తీ, ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ విడుదల, వర్సిటీల్లో విద్యార్థుల ఎన్నికలు, నూతన విద్య విధానానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మాణం చేయాలని తదితర అంశాలను ప్రతిపాదించిన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, నగర అధ్యక్షులు చైతన్యయాదవ్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్, చిరునవ్వు సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత చిత్రపు హన్మంతరావు రచించిన ఏడడుగులు, వర్ణచిత్రం పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విహారి మాట్లాడుతూ.. సమాజ సంఘటనల కంటే సన్నివేశ చిత్రీకరణ ప్రత్యేకతగా తెలుగు కథ, నవలలు రాణించాయని గుర్తు చేశారు. అనంతరం రచయిత దంపతులను ఘనంగా సన్మానించగా అంతకు ముందు కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, రచయిత రాయవరపు గణేశ్వరరావు ఆకాశవాణి విశ్రాంత అధికారి సీఎస్.రాంబాబు, సంస్థ అధ్యక్షులు రాంచంద్రరావు, కార్యదర్శి రఘుశ్రీ పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకుంటే రాజకీయంగా దెబ్బకొడుతాం

బీసీ సంక్షేమ సంఘం నాయకురాలు ఎం.కళావతి

ముషీరాబాద్: సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం ముషీరాబాద్ నియోజకవర్గం మహిళా కమిటీ అధ్యక్షురాలు ఎం.కళావతి అన్నారు. సర్వేను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న పార్టీల నేతలను రాజకీయంగా బీసీలు దెబ్బకొడతారని ఆమె హెచ్చరించారు. ముషీరాబాద్‌లో ఆదివారం ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొన్న కళావతి మాట్లాడుతూ... సర్వే ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందడంతో పాటు ముఖ్యంగా బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయా రంగాలలో మేలు చేకూరుతుందన్నారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు మహేశ్వరి, శివాణి, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.



ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న కళావతి

నేడు మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసం

రాయదుర్గం: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ స్మారక ఉపన్యాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమాన్ని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. 'మనూ' వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కృష్ణకుమార్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొంటారు.

నిత్యావసరాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యూట్రీషియన్ ట్రైనర్ దిలీప్ కులకర్ణీ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నేటి సమాజంలో ప్రజలు నిత్యవసర వస్తువులపైన అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యూట్రీషియన్ ట్రైనర్ దిలీప్ కులకర్ణీ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైట్ కాన్సెప్ట్ మార్కెటింగ్ (ఆర్‌సీఎం) ఆధ్వర్యంలో నిత్యవసరాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బియ్యం, పప్పులు, మంచినూనె, ఎరువులు, కారం, పసుపు తదితర వస్తువుల నాణ్యతను తెలుసుకున్నాకే వినియోగించాలన్నారు. టీవీల్లో వచ్చే ప్రకటనలను చూసి వినియోగదారులు మోసపోవద్దని సూచించారు. ముఖ్యంగా న్యూట్రీషియన్ ఆహార పదార్థాలపైన అవగాహన పెంచుకోకపోతే అనేక అనర్థాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎం మేనేజర్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ ఇన్‌చార్జి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ పునర్‌నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోదవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని డప్పు ఎల్లయ్య బస్తీలో నల్లపోచమ్మ తల్లి ఆలయం పునర్నిర్మాణానికి ఆదివారం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు డాక్టర్.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. అందరూ కలసి కట్టుగా కృషి చేసి ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేయాలనన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్యబస్తీ అధ్యక్షుడు రాజయ్య, నాయకులు వినయ్‌కుమార్, పూసరాజు, రత్నసాయిచంద్, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీకాంత్, పి.నర్సిగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా ఉత్సవ ప్రదర్శనలు



కళాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం


సనత్‌నగర్: వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంపేట వైట్‌హౌస్‌లో ఆదివారం కళా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ నృత్యాలు, స్టాండప్ కామెడీ, సంగీతం, కూచిపూడి తదితర కళల్లో మొత్తం 25 ప్రత్యక్ష ప్రదర్శనలు కొనసాగాయి. ప్రతిభ చాటిన కళాకారులకు భారత ప్రభుత్వ జీవన సాఫల్య అవార్డు గ్రహీత మీనాక్షి పద్మనాభన్, డాక్టర్ సతీశ్ శిఖ, వైష్ణవి పులిపాటి అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భం డా. క్రాంతి మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాక్ ఫౌండేషన్ కల్చరల్ అంబాసిడర్ పులిపాటి చేసిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది.

రేపు ఆదిత్య పరాశ్రీ స్వామి ప్రవచనాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న రవీంద్రభారతిలో అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి ప్రవచనం, గురువందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని ఆమని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తాలతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలి

కాచిగూడ: మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పి.ప్రేంపావని, ప్రధానకార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతేడాది నుంచి కోడిగుడ్లు, అల్పాహారం బిల్లులతో పాటు వంట కార్మికులకు గడిచిన 6 నెలలుగా వేతన బిల్లులు కూడా రావడం లేదన్నారు. పిల్లలకు వంటలు ఎలా చేసిపెడుతారో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల వేతనం వెంటనే చెల్లించాలన్నారు. వంట కార్మికులను రాజకీయ ఇతరత్రా కారణాలతో ఎవరిని కూడా తొలగించకుండా జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి విజయలక్ష్మి, కుంటాల రాములు, ముంతాజ్, వెంకటేష్, ప్రసాద్, రామకృష్ణ, లక్ష్మణ్, వసంత, కాంతమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ప్రేంపావని

11 నుంచి గురునానక్ 555వ జయంత్యుత్సవాలు

రాంగోపాల్‌పేట్: గురునానక్ దేవ్‌జీ ప్రబంధక్ కమిటీ అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15 వరకు సిక్కుల మత గురువు గురునానక్ 555వ జయంత్యుత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్ గురుద్వారాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సికింద్రాబాద్ ప్రబంధక్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బల్దేవ్ సింగ్ బగ్గా, జగన్మోహన్ సింగ్, అఫ్జల్‌గంజ్ గురుద్వారా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్విందర్ సింగ్ బగ్గా, జోగిందర్‌సింగ్ ముజ్రల్ మాట్లాడారు. 11న సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ గురుద్వారా నుంచి నగర్ కీర్తన్ ప్రారంభమై మనోహర్ థియేటర్ మీదుగా క్లాక్‌టవర్, ప్యాట్నీ, ఆర్పీరోడ్, మోండా మార్కెట్, ఆల్ఫా హోటల్ మీదుగా గురుద్వారా వరకు కొనసాగుతుందన్నారు. 13న అఫ్జల్‌గంజ్ అశోక్‌నగర్ గురుద్వారా నుంచి సాయంత్రం 4గంటలకు రెండో నగర్ కీర్తన్ గురుద్వార నుంచి అఫ్జల్‌గంజ్, సిద్ధిఅంబర్‌బజార్, జాంబాగ్, పుత్లీబౌలి, సెంట్రల్ గురుద్వారా గౌలిగూడ మీదుగా అఫ్జల్‌గంజ్ గురుద్వారా చేరుకుంటుందన్నారు. 15న సాయంత్రం 4 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విశాల్ దివాన్ ఉంటుందని తెలంగాణ నుంచి సుమారు 30వేల మంది సిక్కులు పాల్గొననున్నట్లు చెప్పారు. 14న సికింద్రాబాద్ గురుద్వారాలో రాత్రి 7.30 నుంచి 10.30 గంటల వరకు, 15న అఫ్జల్‌గంజ్ గురుద్వారాలో రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు కీర్తన్ దర్బార్ ఉంటుందని తెలిపారు. అలాగే ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



జయంత్యుత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అంజుమన్ స్కూల్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ముషీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఎస్‌ఆర్‌డి సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని అంజుమన్ స్కూల్ ప్రాంగణంలో ఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో మురికివాడ ప్రాంతాలలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీరాం, పూర్ణ, రాజశేఖర్, ఎస్‌ఆర్‌డీ ప్రతినిధులు, శివరాణి, ఇందిరాభారతి, వెంకటేశ్వరి, బీఆర్‌ఎస్ నాయకులు మున్వర్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఎల్‌ఐజీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఉచిత మెగా మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. చెవి, ముక్కు, గొంతు, కంటి సమస్యలు డెంటల్, బీపీ. షుగర్ తదితర వ్యాధులపై చికిత్స అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య మాట్లాడుతూ... వైద్యం వ్యాపారీకరణ పెరిగిపోయి ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కూడా వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేటు, కార్పొరేట్ వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎం శ్రీనివాస్ రావు, పి. శ్రీనివాస్, నగేష్, హస్మిత, సంగీత, మాధవి, లలిత, మోహన్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు

ఓటరు లిస్టులో పేర్లు నమోదు చేయించుకోండి



కాచిగూడలో ఓటరు నమోదు పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా

కాచిగూడ: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు లిస్టులో నమోదు చేయించుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ కోరారు. ఆదివారం కాచిగూడ నింబోలిఅడ్డలో పోలింగ్ బూత్ వద్ద ఓటరు నమోదు పత్రాలను ఆమె అందజేశారు. ఓటరు నమోదు కోసం 6వ నంబర్ ఫారాలను నింపి అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, కృష్ణ, ఎస్.రవి యాదవ్, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్

ఓటరు నమోదు కేంద్రం సందర్శన

ముషీరాబాద్: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓ టు హక్కు కీలకమైందని పౌరులు ఓటరు నమో దు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చిరునామాలో మార్పు, పేర్ల తప్పొప్పులను సరి చేసుకోవచ్చని సూచించారు.